# పాడులోకం – పాడుమనుషులు

నీలకంఠం తోడి గుమాస్తా పెళ్లాం పోయినపుడు అన్నాడు- "ఆ రోజు వస్తే ఎవరూ ఆపలేరు. అయినా నువ్వింత యిదిగా వుండటం బాగులేదు, చచ్చే వాళ్ళతో మనం చచ్చిపోతామా?" పొరుగింటాయన పెద్దకొడుకు కళ్ళు మూస్తే "చావంటే మాసిన బట్టను వదిలి కొత్తది వేసుకోవటమేగా! ఆత్మకు చావులేదని తెలుసుకోరేం?" అనుకున్నాడు. ఆ వీధిలో ఒక యింటిలో వారం రోజులవరకూ ఒక చావుకు మిగిలినవారు ఒకటే యేడుపు. "చావుకు యేడ్చే మనం ముస్లింలు, క్రైస్తవులకంటె యెంత వెనకబడ్డాం!"

నీలకంఠం ఎంత తేలిగ్గా అన్నాడో, అనుకొన్నాడో చావు గురించి, అంత చులకనగా అభిప్రాయపడ్డాడు.

పాతికేళ్ళ పరిచయం వున్న భార్య గతించిందినాటికి. నీలకంఠంకు ఒక కాలు విరిగినట్లు, ఒక చెయ్యి తెగినట్లు, గుండె బీటలు తేరిన ట్లయింది.

చావు .... భయం .... భయంకరం ........ విషాదం ... .... రోజంతా కడుపున నింపుకున్న దుఃఖాన్ని కటిక చీకటిలో డాబామీద కన్నీటిగా కొంత కార్చాడు.

ఉండటానికి ఇల్లు సంపాదిస్తాననీ, భార్యకు పట్టు చీరెలు కొంటాననీ, ఒంటినిండా నగలు నింపుతాననీ, పెళ్ళయిన మొదట్లో అనుకోవటమే కాదు - పెళ్ళాంతో చెప్పాడు కూడాను-చెప్పటమే కాదు-ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం ఊహలోనే జరిగింది "అదృష్టం ఉంటే అవే వస్తాయ్" అని ఆమె అన్ననాడు నవ్వుకున్నాడు.

తొమ్మిది మాసాలు నిండేవరకు తనకు ఎవరైనా ఒకటే అనుకున్నా, కూతురు పుట్టగానే "ఇంటికి లక్ష్మీకళ" అని ఉత్సాహంతో ఊగులాడాడు. ఆ కూతురుకు వీణ నేర్పిస్తాననీ, విద్యల సరస్వతి చేస్తానని యెగిరాడు.

"దాని రాత యెలా వుందో? అప్పుడే యెందుకనుకోవాలి?" అన్న భార్య మీద అప్పుడే చిరాకుపడ్డాడు. రాత - రాత - మనుష్యులు సోమరులవటానికి ఈ పిచ్చి అంటుకుంటుందని అభిప్రాయం వెలిబుచ్చాడు.

ఈ కూతురు పెళ్ళి ఘనంగా చెయ్యాలనీ, గొప్ప ఆఫీసరు అల్లుడవాలని అనుకున్నాడు. అందుకు సర్వ ప్రయత్నాలు, మనోభావాలతో చేసేడు. ఒక కూతురు, ఒక కొడుకూ అయితే చాలు, హాయిగా వుంటుందనుకుంటే, రెండో సంతానమూ కూతురే!

మూడోసారి తప్పక కొడుకే అనుకొన్నాడు. దేవునియొక్క నిజాయితీ చూద్దామని, భార్యతోపాటు తనూ ఒకటి రెండు సార్లు ఉపవాస మున్నాడు. శివాలయానికి వెళ్ళాడు. కొడుకని కలలు కన్నాడు. కొడుకు చదువెలా వుండాలో వూహించుకొన్నాడు. ఈసారి కొడుకు తప్పదని చెప్పుకున్నాడు. కొడుక్కీ తనకూ మధ్య యెలాంటి తగాదాలు ఉండవనీ, తను రిటైరై కొడుకువల్ల సుఖ పడతాననీ తలచాడు. కానీ యీసారీ కూతురే! ఆ నిముషం నుంచీ దేవునిమీద భక్తి గౌరవాలు తగ్గాయి. పూజలు పునస్కారాలు బూటకం అనుకొన్నాడు.

మూడోపిల్లకు తల్లి ఎంతో గర్వంగా, ముగ్గురు పేరంటాళ్ళ పేర్లు కలిపి, "వెంకట సీతా మహాలక్ష్మి" అని పేరు పెట్టింది. నీలకంఠం యీ సన్యాసి యెక్కడ పుట్టిపోయిందని, సన్యాసమ్మ అని పిలిచేవాడు. చివరకు ఆ పేరే నిల్చి పోయింది.

ఆ పిల్ల యెప్పుడూ యేడుపే. నీలకంఠంకు ఎంతో చిరాకెత్తేది. చస్తే పీడా పోయేదని ఆలోచించినా, అలా ఆలోచించటం పాపమని మళ్ళీ సర్దుకొనేవాడు.

సన్యాసమ్మ ఫస్టుఫారం చదువుతో చాలించమంటే, యేడ్చి యేడ్చి, ఒక రోజు అన్నంకూడా మానేసింది. భార్య "పోనీ,దాని సరదా యెందుకు చంపా"లని బతిమాలటంవల్ల థర్డుఫారం వరకూ ఊరుకొన్నాడు.

తనకు ఆడవాళ్ళ చదువుగురించి నిశ్చితమైన అభిప్రాయం యీనాటికీ లేదు. ఏమైనా యీనాటిచదువులు ఆడవాళ్ళకి పనికిరావని మాత్రం నిష్కర్షగా

చెప్పగలడు. సీత, సావిత్రి, శకుంతల నేర్చిన చదువులాంటిది తన అమ్మా యిలకు కూడా చెప్పించాలని, అదే అసలైన చదువని తన అభిప్రాయం. ఆ నిలబసు చెప్పమంటే చెప్పలేడు. చాలమంది చదువుకున్న అమ్మాయిలు పెళ్ళి చేసుకోకపోవడమో, పెళ్ళిచేసుకొన్నా మొగుడు చెప్పినట్లు వుండకపోవటం, డొంకతిరుగుళ్ళు తిరగటం, గర్వం, అహంభావంతో యెగిరిపోవటం - యిలా యెన్ని దృష్టాంతాలైనా తన వాదనను బలపర్చుకోవటానికి చెప్తాడు. ఎవరైనా "సీ చిన్నమ్మాయిని యెందుకు చదివిస్తున్నా" వంటే తనకు తెగ కోపం వచ్చేది. వాళ్ళా ప్రశ్న వేశారని కాదు - ఆ అమ్మాయంటేనే కోపం.

సన్యాసమ్మ యిక చదవటం కల్లోమాట - ఏడుపు! యిక పని చెయ్య లేదు - నాన్నజీతం అమ్మ భద్రంగా పెట్టిలో పెట్టడం చూసింది. ఆ మరుసటి రోజు యింట్లో, పెద్ద రభస జరిగింది - "సరే - మరేం చేస్తాం? పోనీ, చదవ నియ్యం"డన్న పెళ్ళాంమీద నిజంగా ఈ ఒక్కసారే కోపం వచ్చింది. దొంగతనం చేసి స్కూలుజీతం కట్టిన కూతుర్ని సమర్థించినందుకు, భార్యమీదకు యెగిరి పడ్డాడు.

తరువాత తనేదో తప్పు చేశాననుకొన్నాడు. భార్యకు తనిచ్చిన వాగ్దానాలు జ్ఞాపకానికొచ్చాయి. అందులో వెయ్యోవంతైనా తను తీర్చడంలేదు. అయినా, ఆమె తనని కనిపెట్టుకొని వుంది. అప్పుడప్పుడూ తను దురదృష్ట వంతుడని, అసమర్థుడనని, తన భార్య సమర్థురాలనుకోవటం తనకు సరదా!

"ఏమీ అనుకోవ"ద్దని అన్నాడు.

"మీరైనా అనకపోతే, యింకెవరంటా"రని నవ్వుతూ అంది.

అలాంటి భార్య యీనాడు చచ్చిపోయింది.

కొడుకు కావాలన్న ఆశ - ఆరాటమై.... నిరాశై.... చివరకు కూతుర్లు యెదుగుతుంటే.... మంచి పెద్ద హోదాలోవున్న అల్లుళ్ళు కావాలన్న కోర్కె హెచ్చయింది.

ఈ కోర్కె తీర్చుకోవాలనే ఆరాటంలో—

సంఘం పాడై పోయిం దనుకున్నాడు. కట్నాలు రక్తం పిండినట్లు పిండుతున్నారు. ఆడపిల్ల లుండటం నేరం! ఉదాహరణలుగా యెన్ని కుటుంబా లనో వేలెత్తి చూపిస్తాడు.

చాలా సంబంధా లున్నాయని తెలుసు. అవెందుకో తనకు నచ్చ వను కొంటాడు. వాళ్ళతో తనకు పొత్తు కుదరదు. మంచి మనసు కలవాళ్ళయితే ముందుకు వచ్చేవారు!

ముఖ్యంగా తన పెద్దకూతురు పెళ్ళి మనసులో యిరవై నాల్గుగంటలూ వుండేది. ఆమెను ఒక చక్రవర్తి కిచ్చినా తన ఋణం తీరదు. ఆ కూతురు

కడుపులో ఉన్నప్పటినుంచీ గర్వించాడు. రాను రాను పలవరించాడు. రోడ్డుమీద యెవరైనా అందమైన కుర్రవాడు కనిపిస్తే తేరి జూచేవాడు. ఒక్కొక్కసారి నా కూతురికి తగినవా డీలోకంలో లేడేమో అనిపించేది. అందం ఉంటే గుణం పూజ్యం. గుణం వుంటే అందం తక్కువ!

ఒక్కొక్కసారి అనుకునేవాడు: "ఈ కుర్రాడు చాలా మంచివాడు. కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలని పట్టుదల. కానీ తండ్రి వేలమీద ఉన్నాడు. ఈ సంఘర్షణలో పాపం నలిగిపోతున్నా"డని విచారించేవాడు.

ఇంకో ముసలాయన్ని చూసి "ఈయన రెండువేపులా ఖర్చులు భరించు కొని, వున్న ఒక్క కొడుకును, పేదింటిపిల్ల నిచ్చి పెళ్ళి చేదామనుకొంటు న్నాడు. కానీ, పెళ్ళాం, కొడుకు కాదంటున్నారు.." "ఉద్యోగం అయ్యాక గానీ పెళ్ళిచేసుకో"నని చెప్పేవాళ్ళు చాలామంది తన వూహకు వచ్చేవారు. ఈ వూహలో వచ్చినవాళ్ళలో పెళ్ళయినవాళ్ళు, పిల్లలున్న వాళ్ళుకూడా వుండేవారు.

తన వూహ ఒక్కసారే నిజమైంది. బాగా డబ్బు వున్నవాళ్లే. ఆ అబ్బా యిని చూడగానే కమ్యూనిష్టనుకొన్నాడు. అక్షరాలా నిజమైంది. ఆ తండ్రి ఆ కొడుకు కోసం పడ్డ ఆరాటం! తండ్రినే దొంగలా చూస్తాడేం ఆ కొడుకు? నీలకంఠం ఆ కుర్రాడు తనకు అల్లుడు కాకూడదనుకున్నా రెండురోజులవరకూ విచారించాడు. ఈ లోకంలో ప్రజలు యెందుకు యిన్ని పార్టీలుగా విడిపోతారో, తనకు అర్థం కావటం లేదు. తనకు మొదటినుంచీ యిప్పటికి ఒకటే దృక్పథం. తను ఆ రోజుల్లో ఖద్దరు కట్టాలనీ, సత్యాగ్రహం చెయ్యాలనీ, జైలుకు వెళ్ళాలనీ, త్యాగ పురుషుడవ్వాలనీ యెంతో ఉబలాట పడ్డాడు. ఏదీ జరగలేదు కానీ, తనకు కమ్యూనిజ మంటే పూర్తిగా తెలియకపోయినా, మనిషిని కమ్చీతో కొట్టి పని చెయ్యిస్తుందని అసహ్యంగా చూస్తాడు.

అయినా, యీ ప్రజలు ఒకరినొకరు అసహ్యించుకోవటం తనకు గిట్టదు. చిన్నకూతురుమీద తనకు అసహ్యం అంటే ఒప్పుకోడు. కూతురంటే అభిమానమే, కూతురు గుణాలంటే నచ్చవు. కాని ఈ లోకంలో ఎవరికి తగ్గ కష్టాలు వాళ్ళకి వున్నాయి. డబ్బుకోసం ఒకతెగ కష్టపడితే, మానసికంగా మరి కొందరు బాధ పడతారు - అంతే భేద మని చెప్తాడు.

అల్లుళ్ళకోసం ప్రయత్నించింది తక్కువ - ఆలోచించింది యెక్కువ - మనసులో బాధపడింది బ్రహ్మాండం!

ఆఫీసులో తను డబ్బు రాబట్టుకోగల సీటులోనే ఉండేవాడు. ఈ కూతుర్ల పెళ్ళి ఒక్కొక్కసారి మనసును ఆ విషయం వేపు త్రిప్పేది. ఎంతో మంది పుచ్చుకొంటున్నారు కదా తను ఎందుకు పుచ్చుకోకూడదని పొరపాటున

అనుకొన్నాడు. పని అయ్యేవరకు బ్రతిమాలి డబ్బు చేత పెట్టారు. తరువాత శాపనాలు కురిపిస్తారు. అంతేకాకుండా, డబ్బు పుచ్చుకుంటే తన్ను తనే తిట్టుకోవాలి! అనుమానించాలి. లోకం యెన్నికైన మనిషిని అనదు. దొంగని చూపించినట్లు వ్రేలుతో చూపిస్తుంది. తను వృత్తి గాలిబుట్టవలె తేలిపోతాడు. లంచాలు పుచ్చుకొన్న తోడి గుమస్తా పెళ్ళాం చచ్చిపోయిందే! తనలా చేస్తే తన పెళ్ళాం పోతుంది. వద్దు వద్దని వందసార్లు అనుకున్నాడు. ఈ బ్రతుకే చాలు.... ఈ పెళ్ళామే మహాలక్ష్మి!

పెద్దకట్నం యెర చూపలేని తను పెద్దకూతురు పెళ్ళినాడు ఎంత బాధ పడ్డాడు! ఈ సంఘంమీద యెంతగా యేడ్చాడో, తను అనుకున్నదల్లా జ్ఞప్తికి వచ్చి గుండె పగిలిపోయింది. అందం,నెమ్మది ఆభరణాలుగాగల యీ కూతుర్ని- ముందూ వెనుక యెవరూ లేని తనలాంటి గుమస్తాకే యిచ్చాడు! ఈ పెళ్ళయినా తను యేవగించుకొన్నా పెళ్ళాం పిసినారితనం వల్లనే జరిగింది.

గుండెలో పుండు యింకా మానలేదు. గునపాం పోటులా తగిలింది. విద్యల సరస్వతిగా, వీణావాణిగా యింకా వూహలో నిల్చిన కూతురు విధవై కూర్చుంది! దేవుడు గ్రుడ్డివాడని యేడ్చాడు.

విధవా వివాహా లంటే తనకు ప్రీతి. వీరేశలింగం గారంటే భక్తి. ఎవరైనా అలాంటి వివాహాలు చేశారంటే ముచ్చట పడతాడు. కాని తన కూతురుకు మళ్ళీ పెళ్ళి చెయ్యటమంటే గిట్టని పని!

ఆడవాళ్ళు పవిత్రులనీ, వాళ్ళ పాతివ్రత్యము మన సంఘాన్ని, సాంప్రదాయాల్ని, యీ దొరలు రాజ్యం చేసినా, నిలిపిందనీ, తన గట్టి నమ్మకం. తన భార్య యెపుడూ నాకిది కావాలని, అది కావాలనీ కోరలేదు. తన మాటకు యెదు రాడలేదు. బాధపడటానికి జంకలేదు - అన్నిటికి తల ఒగ్గింది - యీ నరకాన్ని స్వర్గం చేసుకొంది.

అచ్చంగా ఆమెలానే కూతుర్లూ వుండాలని కాంక్షించాడు నీలకంఠం. అందుకే మొదటి యిద్దరి కూతుర్లంటే తనకు తెగ అభిమానం. భార్యకు వీళ్ళకు తేడా - భార్య ఉత్తరం వ్రాయలేదు - వీళ్ళిద్దరూ వ్రాయగలరు.

ఇన్ని కష్టాలు పంచుకొన్న భార్య పోయింది. ఆలోచించాడు. ఆమెతో వున్న కాలమంతా నెమరువేసుకొన్నాడు - ఏకాకిగా యేడ్చాడు. ఆ వయసులో వా ళ్ళెవరూ అంతగా యేడవనట్లు యేడ్చాడు. అంతేకాదు, ఆ భార్య చివరి గడియలు జ్ఞప్తికి వస్తే, యీ పాతికేళ్ళూ దగ్గరగా వున్నవాడు, ఆమెకు దూరమైనట్లు అనిపించేది. ఆ ఆలోచన రాకుండా వుండాలని ప్రయత్నించేవాడు.

"ఆమె స్వంతలాభం చూసుకొంది, ఆమె జీవితంలో ఒక్కసారే - అదీ చనిపోయేముందు-" నీలకంఠం దృష్టితో! యింత కల్లోలంగా వున్న యింటిని చూసి ఎలా విడిచివెళ్ళింది? పుణ్యస్త్రీ చావు రావాలని కోరుకుందే? ఏమిటోపిచ్చి! అంత మంచి మనిషి యేం కోరుకుంటే అది రాదూ? భార్య యింకా బ్రతుకుతా నని కోరుకుంటే నీలకంఠం దృష్టిలో బ్రతికేదే!

ఆమెతో యిల్లు సంపాదిస్తా నన్నాడు. ఆమె అద్దె యింటిలోనే చనిపోయింది. ఒంటినిండానగలు నింపుతా నన్నాడు - మంగళసూత్రంతోనే మాయమైపోయింది. పట్టుచీరలు కొంటా నన్నాడు - మాసిన బట్టలతోనే చనిపోయింది-! అయినా, ఆమె యివేవీ లేకపోయినా "నా కేం లోటు" అంటుండేది! ఇదే తల పుకువచ్చి మరీ కళ్ళు నులుపుకున్నాడు!

ఇటు మనసులో మూలుగుతూ అటు పెద్దమ్మాయి లిద్దరివేపు చూస్తూంటే గుండె తరుక్కుపోతూంది!

ఇద్దరూ ఆ తల్లిని తల్చుకుని యేడుస్తారు. వాళ్ళని తను ఓదార్చాలనుకున్నా ఓదార్చలేడు! తను అసమర్థుడని అనుకోవటంకన్నా లోకం తనకు అన్యాయం చేసిందని ఎవరితోనూ చెప్పుకోలేకపోతున్నాడు. తన ప్రస్తుత పరిస్థితిలో రెండో అమ్మాయి పెళ్ళి వూహించటానికైనా వీలులేదని స్ఫురించింది. అంత నమ్రతతో బ్రతికిన యిల్లాలికి తను ఎంతైనా ఋణపడి ఉన్నాడు. ఆ ఋణం తీర్చుకోడానికి, కార్యానికి, మాసికాలకూ రూపాయకు నెలకు అణా వడ్డీలకు అప్పు చాడటానికి జంక లేదు. ఒక మిత్రుని దయవల్ల ఒక షావుకారు దగ్గర యెటువంటి హామీ లేకుండా యీ మూడువందల చిల్లర దొరికింది! అలా దొరికింది అంటే ఆ భార్య మంచితనమే అనుకొన్నాడు.

నెలనాడు యిరవైరూపాయలు వడ్డీ కట్టాడేకాని, మనసు భయంతో నిండిపోయింది. అన్నమాటకు నిలపడటం తన విధి తను గంజి తాగైనా అప్పు తీర్చాలి అని అనుకున్నాడు - ఆ విషయం అహోరాత్రాలు ఆలోచించేవాడు.

ఈ ఆలోచనలతో నీరసించటం అలావుంచి చిన్నకూతురొక సమస్య తెచ్చిపెట్టింది. తల్లిపోతే బెంగపెట్టుకొని కుమిలిపోవలసింది! నిజానికి ఆ తల్లి మిగతా యిద్దరికన్నా, యీ చిన్నకూతుర్నే బాగా చూసింది. వాళ్ళలా యీ కూతురు కుంగిపోకపోవటం చూసి యెంత కృతఘ్నురాలని అసహ్యపడ్డాడు.

ఇంటరులో చేరుతానని పట్టుపడితే తను పట్టలేని కోపంతో మాట్లాడలేక పళ్ళు పటపటలాడించాడు. 'స్నేహితురాళ్ళు సహాయం చేస్తామంటున్నారు, మీరేమీ అడ్డుపెట్టకండి' అంటే, వెటకారంతో యీసడింపు మాటలాడాడు. దీనితో కూతురు యింట్లో మిగతా యిద్దరిలా దేవతా విగ్రహంలా పవిత్రంగా వుంటుం దనుకొన్నాడు.

సన్యాసమ్మ యింటరులో చేరింది! ఎప్పుడూ లేనిది నీలకంఠం కళ్ళు తడుపుకొని, తన కోపాన్ని దుఃఖంతో మిళితంచేసి, మిగతా కూతుళ్ళ దగ్గర వెళ్ళ గ్రక్కాడు. భార్య ప్రయత్నం లేకుండానే జ్ఞాపకం వచ్చింది.

కాలేజీనుంచి యింటికి వచ్చిన చెల్లెల్ని యిద్దరూ మందలించారు. నాన్న కష్టాన్ని చెప్పారు. సన్యాసమ్మ తనను కాదన్నట్లుగా వూరుకొని, మళ్ళీ స్కూలుకు వెళ్ళిపోతూ అంది - "నాన్నకా దొంగతనం యెందుకు? నన్నేమైనా అనాలని వుంటే నా యెదురుగా అనకూడదేం?"

అసలు మన సంఘంలో యే యింటిలోనూ జరగనిపని జరిగిందని నీల కంఠం బాధపడ్డాడు!

దాని ప్రతిఫలం ఆ మరుచటినెల తను వూహించినట్లే కనబడింది. ప్రయి వేట్లు కూతురు చెప్పటం చూశాడు. ఒకనాడు ఆఫీసునుంచి వస్తూ గోడలమీద రాతలను చూసి కళ్ళు పొడుచుకోవాలనుకున్నాడు. తన పెళ్ళాన్ని తలుచుకొని, మనసునిండుగా దుఃఖాన్ని నింపుకొన్నాడు. ఆ కోపంతో వచ్చి "చూడండమ్మా! మీ చెల్లెలిపేరు గోడ లెక్కిందే! కర్మ! కర్మ!" అంటూ తల బాదుకున్నాడు.

ఇద్దరు కూతుర్ల కళ్ళలో నీటిపర్యంతం వచ్చింది. రెండో అమ్మాయి ధైర్యం చేసి చెల్లెల్ని మందలించింది.

''ఎవరో తెలివితక్కువ వెధవలైతే నే నెందుకు బాధపడాలి? రాయటమే కాదు - పేపర్లు కూడా పంచిపెట్టనీ'' అంది. ఈ మాటలు ఒక చెవిని వింటున్న తండ్రికి ఒళ్ళంతా జరజరలాడింది.

ఇంకోనెలలో కూతురు జోడు వేసుకోవటం చూశాడు. మడమలు కొద్దిగా యెత్తుగా వున్నయ్. ఏదో బ్రహ్మాండం బ్రద్దలైనట్లుగా అనిపించింది. అది మన సంస్కారానికి తగదనిపించింది. ముఖ మెత్తుకొని ఠీవిగా నడిచే ఆడవాళ్ళని తను నేర్చుకోలేదు. ఇన్నాళ్ళు అగాడు, కూతురు ఒకనాడైనా, ఒక కానీ అడుగు తుందేమో అని. అడగకపోవటంతో తను యింటికి పెద్దననే విషయాన్ని గమ నించలేదని, యేవగించుకున్నాడు. చిన్న కూతురికి ముఖం చూపడమన్నా, ఆమెతో మాట్లాడడమన్నా అసహ్యమైన పని - తన మనసు ససేమిరా ఒప్పుకో లేదు. దీని కింకో కారణంకూడా వుంది. ఆ వీధిలోనే కొందరు కాలేజీకుర్రాళ్ళు వున్నారు. ఒక నెల అవుసరానికి ఒక కుర్రాడ్ని అడిగి డబ్బు అప్పు తీసుకుందని తెలిసిపోయింది. ఆ కుర్రాళ్ళంటే తనకు అసహ్యం. వాళ్ళు తన పిల్లలకోసం చప్పరిస్తూంటారని! అలాంటి తెగలో వాడిని అప్పు అడిగింది!

ఈ కోపం ఉంచుకోడానికి మనసులో చోటులేక వెళ్ళగక్కాడు. "ఆడవాళ్ళ ప్రతి విషయంలో మగవాళ్ళు మహా తెలిసినట్లు జోక్యం చేసుకోవటం అంత

మంచిపని కాదక్కా! ఆడవాళ్ళ బుర్రలో మట్టిలేదుగా! ప్రతిదానికి నాన్న మీదనే ఆధారపడమంటావ్? కన్నందుకు కడుపునిండా తిండి పెడ్తున్నారు చాలదా?''

ఈ సమాధానంతో యిద్దరూ నోరు మూసుకున్నారు.

సన్యాసమ్మకు చదు విచ్చిన సంస్కారం నడకలోను, వేషభాషల్లోనూ కనిపిస్తూనే వుంది. అందమైన ఆ ముఖానికి మెరుగు పెట్టిందీ చదువు మాటల్లో ముత్యాలు రాలతాయి. నవ్వకుండానే మోదాన్ని కొలిపే ముఖం. చిరునవ్వు వెలగబోస్తే చూచేవాళ్ళు చాలా సేపటివరకూ ఆ ముఖాన్ని మనసునుండి తుడిచి వెయ్యలేరు. యౌవనం ప్రతి అవయవంలోనికి చొచ్చుకొనిపోయి విజృంభించింది!

ఇలాంటి కూతుర్ని తను ఎంత స్వేచ్ఛగా విడిచిపెట్టాడు? లోకం ఏమనుకుంటుంది? ఆమెకు చిన్ననాడు వచ్చిన జబ్బులు కూడా తలపుకు వచ్చేయి. అనుకోకుండానే అప్పుడు డాక్టరుని ఎందుకు పెట్టానని తికమకపడ్డాడు.

ఈ కూతురు మనసుకు యిచ్చే ఆవేదనతోబాటు, ఆటు డబ్బుకు కూడా చిక్కులు పడ్తున్నాడు. ఇదివరకు ఒకరిదగ్గరికి వెళ్ళి చేయి చాపే అవసరం తన భార్య కలగనివ్వలేదు. ఇప్పుడు తెచ్చిన డబ్బు ఖర్చు పెట్టడం కూడా తనకు తెలియటం లేదు. తను ఒకసారి హెచ్చు ఖర్చు పెట్టేస్తున్నానని, యింకోసారి పిసినారినై పోతున్నానని అనుకున్నా తనకు ఎన్నడూ లేనిది డబ్బున్నవాళ్ళ ఖర్చులతో తన ఖర్చులు; వాళ్ళ నిజాయితీ, వాళ్ళ కష్టాలతో తన కష్టాలను పోల్చుకోవటం అలవాటయ్యింది. ముఖ్యంగా నెలకు వడ్డీ కట్టిననాడు మన స్సెంతో అటమటించిపోయేది ఆ బాధతో ఎందరో తనలాంటి గుమాస్తాల గురించి కుటుంబాల గూర్చి, కడుపుసొదతో, అడుక్కునేవాళ్ళ విషయం ఆలోచించేవాడు. ఆ రాత్రంతా నిద్దర వుండేదికాదు. రష్యాలో అంతా ప్రభుత్వమే చూస్తుందట. మన దేశంలో అలాంటి ప్రభుత్వం లేదే అనిపించేది. మిగతాడబ్బు యింట్లో చాలక యే స్నేహితుడినో అడిగితే అడిగేవాడు. లేదన్నపుడు, మెడకు వురిపోసుకోవాలన్నంతగా మనస్సు చచ్చిపోయేది.

రానురాను ఆర్థికంగా కష్టం వూహించటమే కాకుండా, అనుభవించటం జరుగుతోంది. రోజుకురోజు మనిషి బెంగతో నీరసించిపోతున్నాడు. తనెందుకా అప్పు తీర్చాలనికూడా ఆలోచించకపోలేదు. మధ్యను ఒకడ్ని పెట్టాడే- అందులో ఆ డబ్బు భార్యకోసం వినియోగించాడే - మాటపోదూ?

తనకు యిదివరలా ధృడంగా ఉండే నమ్మకాలు కూడా చెదరజొచ్చినయ్. నిజాయితీ ఏమిటనుకున్నాడు. తన తహశీల్దారు రెండు కుక్కల్ని పెంచుతున్నాడే! - తన హెడ్ గుమస్తా స్వంత మేడలో వుంటున్నాడే! తనకు తెలిసినవాళ్ళల్లో నిజాయితీగావున్న వాళ్ళెవరూ కనబడలేదు తను నిజాయితీగా వుండి మాత్రం యేం సుఖపడ్డాడు? తన పెళ్ళామూ పోయింది. తన కూతురా

విధవైంది - తనకా మగ సంతానం లేదు. ఆడపిల్లలున్నందుకు బాధ్యత తీర్చుకో లేకపోయాడు.

ఇదే నిశ్చయానికి వచ్చి, తనకు డబ్బిచ్చేవాళ్ళెవరూ కనబడలేదు. ప్రతీ దానికీ మీదనున్నవాళ్లే తడుముకుంటుంటే తనవరకూ వచ్చేదేమిటి? - బేడకు, పావలాకు కక్కుర్తిపడేది బదులు వూరుకొంటే వుత్తమం డబ్బున్నవాళ్లు మరింత పెరగడానికి, పేదవాళ్ళమీద సవారీ నిజంగా చేస్తారని, వాళ్ళ మానసిక బాధలకు, ఈ సవారీ సరిగ్గా చెయ్యలేకపోయామనేదే కారణమని తోచింది. ఇన్ని పార్టీలుగా ప్రజలు విడిపోవటంలో బేసబబు ఏమీ లేదనిపించింది సుఖం లేనిది ప్రజలంతా ఒక తాటిని ఎలా నడుస్తారు? కొందరి కడుపులు మాడుతూంటే, మరికొందరి కడుపులు నింపుగా వుంటాయ్. కొందర్ని చూసి మరికొందరు అసహ్యించుకొంటారు - ఒకరి నీడ యింకొకరు చూడలేరు పేపర్లలో పెద్దపెద్ద వాళ్ళ ప్రపంచ శ్రేయమే ప్రభుత్వమని, ప్రజా ప్రభుత్వమని, ఇలా పెద్దగా యిచ్చే ఉపన్యాసాలు చూస్తూంటే యిదివరలా తను యిప్పుడు ఆసక్తి చూపించ లేకపోతున్నాడు. సంస్కృతి గురించి ఎవరైనా మాట్లాడితే యిదివరలా చెవి యొగ్గలేకపోతున్నాడు. ఆకలితో ఉన్న కడుపుకు అన్నమే సంస్కృతి - బాధ పడే మనిషికి సుఖమే సంస్కృతి. ఈ సుఖం కమ్యూనిజంలో వస్తుందని విన్నాడు. దాని గురించి కొంత తెలుసుకున్నాడు. ఎలక్షనులో ఆ పార్టీకి వోటు వేశాడు. రాజకీయ చైతన్యం లేకుండా బ్రతక కూడదని తోచిం దతనికి. తను రిటైరయ్యేలోగా ఈ దేశంలో అంతా ప్రభుత్వం చూసుకొనే పరిస్థితి వస్తే ఎంత అదృష్టం అనుకున్నాడు.

ఈ డబ్బు విషయంలో తప్ప మిగతా విషయాలలో రష్యా సంపాదించిన అభ్యుదయాన్ని తను కోరలేదు. రష్యాలో స్త్రీలు గద్దెక్కి మాట్లాడతారు, సైకిళ్లు తొక్కుతారు, విమానాలు నడుపుతారు, మొగాళ్ళతో సరిసమానంగా ఉంటారు - వాళ్ళపనిని పంచుకుంటారు. అది యీ దేశానికి పనికిరాదని నీలకంఠం నిశ్చితాభిప్రాయం. మన బతుకులు వేరు. ఏమైనా, మన జీవితాశయం వేరు. ప్రపంచంలో మన మతానికి ఒక విశిష్టమైన స్థానం, మనకు గొప్ప సాంప్రదాయాలువున్నాయ్. ఆడది పూజింపతగ్గ పవిత్రవస్తువు వాళ్లు గృహలక్ష్ములు. భర్తయందు గౌరవం,- నవ్వుతూనే కష్టాలు అనుభవించే సహనం గలవాళ్ళే దేశపుస్త్రీలు!

ఆర్థిక సంబంధమైన ఆశయాల్లో మార్పు వచ్చినా, నీలకంఠం నిజ స్వరూపం అట్టే మారలేదు. అంచేతనే, తనకూ, చిన్న కూతురుకూ తగాదా వచ్చింది.

ఈసారి కూతురిమీద అనుకోకుండానే విజృంభించాడు. సన్యాసమ్మ వెంటనే జవాబు చెప్పకుండా తరువాత తండ్రికి వినిపించేటట్లు పెద్ద అక్కతో అంది:

"అభ్యుదయం అనేవాళ్ళే అలా తీసుకొంటే నేనేం చేస్తాను? మనుషుల నాలుకకు హృదయానికి పోలిక లేదెప్పుడూ! వాళ్ళని నాన్న పెద్దమనుషులుగా భావించడ మెందుకో?"

ఈ రకమైన మాటలు తనకు మరింత వైరెత్తించినయ్. ఏం లేకపోతే లోకం వూరికే అనదు. తన కూతురు ఆ డిమాన్‌స్ట్రేటరు వలలో చిక్కుకుందనే ధృఢమైన వూహ తనను వూరుకోనియ్యలేదు. కాలేజీ కుర్రాళ్ళు తనను చూచి అనలేదే! వాళ్ళు దారంటపోతూ అనుకొంటూంటే తను విన్నాడు. కూతుర్ని రేపట్నించి కాలేజీకి వెళ్లొద్దన్నాడు.

"చాల్లెద్దూ యీ చదువు" అంది రెండో అక్క. సన్యాసమ్మ నెమ్మదిగా "నాకు తెలుసు చదువుకుంటే ఆడదాని శీలం చెడుతుందని యీ రకంవాళ్ళ వుద్దేశ్యం! అమాయకురాలిగా కనబడని ఆడదాన్ని గౌరవించలేనివాళ్లు, ఆత్మ వంచన చేసుకొంటున్నారు. అందుకేమైనా అంటారు. ఆ డిమాన్‌స్ట్రేటరుకు జవాబు చెప్పకుండా వుంటే యెంతగర్వం అనేవాళ్ళు లేకపోరు!"

ఇంకా కూతురు చలించకుండా కళ్ళలో నీరు లేకుండా మాటాడటం నీలకంఠం కోపం రెట్టింపు కావటానికి ఆధారమైంది. యింక యిల్లు కదిలితే కాలు విరగగొట్టానని అరిచాడు. కళ్ళల్లో కోపం నీటిని గిరగిర త్రిప్పింది. ఎవరి నైనా క్షమించగలడు గాని, శీలం లేని ఆడదానిని క్షమించలేడు. నేను చదువు మాననని కూతురు వెంటనే చెప్పటంతో పళ్లు పటపట కొరుక్కున్నాడు. పెదాలు కరుచుకున్నాడు. ఈ కూతురు, ఎవరితోనో లేచిపోయి, తను వురిపోసుకునేటట్లు చేస్తుందని అనుకొన్నాడు.

ద్విగుణీకృతమైన కోపంతో సిగ్గు తెచ్చుకోమని యింకా నానామాటలు అన్నా, సన్యాసమ్మ అక్కడనుంచి జవాబు యివ్వకుండా కదలిపోయింది. ఇద్దరు అక్కలు నాన్న కాళ్ళమీదపడి క్షమాపణ కోరుకో అన్నట్లుగా చూస్తూంటే, చివరకు నెమ్మదిగా అంది ''చస్తాను గానీ....''

ఈ మాట స్ఫుటంగా చెవులో పడగానే నీలకంఠం మనసు అదోలా అయిపోయింది. ఆ రాత్రి పడుకుందామన్నా ఈ మాటే మనసులో నుంచి కదల్లేదు. తెల్లవారి లేవగానే చావు మనసులో తిరిగింది. గబగబ అద్దంలో చూసు కున్నాడు. తనెంతగా చిక్కిపోయాడు? నిజంగా సగానికి సగమయ్యాడు. బలం లేనిది బ్రతుకేమిటి? తను అప్పులతోనే కుంగిపోతున్నానని, ఆ వడ్డీలు పుచ్చుకొనే వాళ్ళు తనని పిప్పిచేస్తున్నారని, వాళ్ళనెందుకు తను పోషించాలని-యిలా యెంతో వూహించటం జరిగింది.

ఆవేళ పేపర్లో చావుగురించి పడినవార్త చదవటానికి జంకేడు. ఆ మరుసటి రోజు యేదో శవం వెళ్ళిపోతూంటే తలదించి ప్రక్కరోడ్డుగుండా వెళ్ళిపోయాడు.

చిన్న కూతుర్ని చూస్తే తన కేదో భయం ఆవరించింది. ఆమెను ఒక అసహ్యపుముద్దగా పరిగణించాడు. ఈ రోజుల్లో యెంత ఆలోచించకూడదను కున్నా మనసులో ఆ చావు విషయమే తిరుగుతోంది రోజుకురోజు ఆ భయం పోతోందని అనుకోవాలనుకున్నా అది హెచ్చవుతోంది.

అబ్బబ్బ! ఏమిటి యింత పిరికి అనుకున్నా-అమ్మో, నేను యిలా ఎండి పోయానే, యే నిముషంలో ఒంటికేమొస్తుందోనన్న భయం, ఈ అప్పుల భయంతోపాటు నరాలన్నిటినీ పీకేస్తున్నది.

తను చిన్న దగ్గు దగ్గినా, చిన్న రొంప చేసినా, పెద్ద కూతుర్లిద్దరివేపూ జాలిగా చూసేవాడు. ఒకనాటి రాత్రంతా వాళ్లిద్దరి గురించే ఆలోచించాడు. ఆ రాత్రి తను త్వరగా చచ్చిపోతానన్న అనుమానమే తన్నలా కృంగతీసింది.

ఆ మరుసటిరోజు నుంచీ తను శ్రమపడకుండా వుంటే బ్రతుకుతానని అనుకున్నా, శ్రమపడుతూనే ఉన్నాడు. జీతం అందుకుని వడ్డీ కట్టూనే వున్నాడు. తను అన్నం కొద్దిగానే తింటున్నాడు.

రానురాను ఒక దయ్యంలా యీ చావు భయం తన్ను బాధిస్తూనేవుంది. తన నీడనే చూసి భయపడేవాడు. ఏ రాత్రిమీద తెలివివస్తే అరుంధతి చుక్క కనిపిస్తుందో లేదోనని చూచేవాడు. ఒక్కొక్కసారి కనిపించేది కాదు. దానితో మనసు వికల మయ్యేది. తన భార్యచావు జ్ఞప్తికి వస్తే - యిదివరలా ఆ చావు తలచుకోలేకపోయాడు!

తన యిద్దరి కూతుర్లమీద అభిమానమే తన నింతగా భయపెట్తోందను కున్నా, ఆ అభిమానం రోజురోజుకు రెట్టింపవుతోంది! ఒక్కొక్కసారి ఆలోచనలు చాలాదూరం వెళ్ళిపోయేవి! తను చచ్చిపోతే, - వాళ్ళు అడుక్కుంటారు.... అడుక్కుంటే యెవరు కానీ వేస్తారు....యిచ్చినా యెన్నాళ్ళు.......

నిజంగా తనకు ఒకనాడు జ్వరం వచ్చింది. కూతురే అంది: "జ్వరం వచ్చింది, ఆఫీసుకు వెళ్ళవద్దని." తనకు జ్వరం వచ్చిందనుకోవటం యిష్టం లేదు. ఏమీ లేదని మొండికెత్తి ఆఫీసుకు వెళ్ళేడు త్రోవలో తల తిరిగి పోతూంటే లోకం, వ్యక్తులూ, వ్యవహారాలు, అంతా ఒక బూటకం అని పించింది. తహసీల్దారు నుంచి బంట్రోతువరకూ లంచగొండ్లుగాను, కుర్రవాడి దగ్గర నుంచి ముసలాళ్ళవరకు స్వలాభపరులుగాను కనిపించారు. చివరకు తన్నుతానే అసహ్యించుకోజొచ్చాడు. తానొక పచ్చి అసమర్థుడని తోచటమే

కాదు, నిర్ధారించుకొన్నాడు. యిలా తను అనుకోగల్గేశంటే ఆ కూతుర్లమీద నున్న అనురాగమే!

చిన్నమ్మాయి, డాక్టరుకు చూపిద్దామంటే, నీలకంఠంకి కోపం వచ్చింది. లంకణాలు చేసిన మనిషి మరింత నీరసించిపోయాడు. కాని, జ్వరం తగ్గలేదు. యిల్లు కదలలేని పరిస్థితి వచ్చింది. మంచం ఎప్పుడైతే యెక్కాడో, ప్రతిక్షణం, బలంలేని మనస్సుకు చావు తలపు బాగా అంటుకుంది.

నాలుగురోజులు గడిచాయి గాని, జ్వరం తగ్గే అవకాశాలేవీ కనబడలేదు. ఏ నిముషంలో తను చచ్చిపోతాడో అనుకొనేవాడు. గుండె ఆగిపోతూన్నట్లని పించేది.

తనకు దేవునిమీద భక్తి పూర్తిగా చచ్చిపోలేదు. యిలాంటప్పుడు తను గంటల తరబడి ప్రార్థించేడు. తన దేవునికి పూజా పురస్కారాలు చేయకుండా అపరాధం చేసినా, తన పెళ్ళాం, యిద్దరు కూతుర్లు అపరాధం చేయలేదు. అంచేత వాళ్ళిద్దరికోసం తను చచ్చిపోకుండా ఉండే వరం ప్రసాదించమన్నాడు. చావు రాదు- రాదనే కోరిక ప్రతీ క్షణంలో నింపుదామనుకునే, అధైర్యాన్ని నింపుకున్నాడు.

ఇద్దరు కూతుర్లు దగ్గిర వాడిన ముఖాల్తో కూర్చుంటే, కడుపులో కత్తితో పొడిచినట్లయ్యేది. అవును - తానొకడే యీ లోకంలో అసమర్థుడు!

జబ్బుకంటే మనోవ్యాధే మనిషిని కూల్చేసింది. అలా ఒక్కొక్కసారే తలపుకు వచ్చి, "అబ్బే! నాకేం జబ్బు? తిండిలేక నీరసించిపోయాను కానీ, నాది గట్టి శరీరమే! నేను చచ్చిపోడమేమిటి?"

ఈ ధైర్యం ఒక లిప్తలోనే మటుమాయమై పోయేది. చిన్న కూతురు డాక్టరుని తెచ్చి పెట్టింది. తనకు డాక్టరు మాటలు రుచించలేదు. డబ్బు గుంజాకో దానికి యింతది అంత చేస్తారని, తనకు లేని జబ్బుని తెచ్చి పెట్తారని అసహ్యం! నాలుగురోజులు గడిచినా, మనిషి నాలుగింతలు నీరసించాడు. ప్రతి నిముషం "నేను చచ్చిపోను" అనే అనుకొంటున్నాడు.

ఆరాత్రి తనకు అనుమానం హెచ్చిపోయింది. తనభార్య చావు కళ్ళకు కట్టుతోంది. తన పెళ్ళాం పిలుస్తున్నట్లుగా తోచింది! తన ఒంట్లో అంత నీరసం వుండనే వుంది. "అబ్బా! చావు ... చావు ... నేను చచ్చిపోవటమే........ అయ్యో దేవుడా!.... నా కూతుర్ల గతేంగాను ......."

కన్నులు మూతలు పడలేదు. ప్రతిక్షణంలోనూ యేడుస్తున్నాడు. దేవుడు గుడ్డివాడని, యీ ప్రపంచంలో న్యాయంగా పోయేవాడికి కూడు లేదని

విలపించాడు. వెక్కివెక్కి యేడ్చాడు. పెద్దకూతురు కూర్చునే కునుకుతూంది. ఆ కూతురు ముఖం చూస్తూంటే, అతనికి ఎక్కడలేని అభిమానం కప్పేసింది! "అవును నా తల్లి....యెంత ఉత్తమురాలు! ఇలాంటప్పుడు గాజులు గలగల్లాడుతూ నుదుటి కుంకుమతో....పిల్లలతో వచ్చి నా దగ్గర కూర్చుని వుంటే....నేనెంత హాయిగా చచ్చిపోదును!" బెక్కుతున్నాడు. ముక్కు నులుపుకుంటున్నాడు.

అ ప్రక్కనే రెండోకూతురు నిద్ర పోతూంది! హెరికేన్ లాంతరు మసక మసగ్గా వెలుగుతోంది! ఎప్పుడు ఆరిపోతుందో ....! తన ప్రాణం అంతే అనిపించింది !

తను యింకెంతసేపో బ్రతకనని నమ్మకంగా అనుకొన్నాడు. ఆ ఇద్దరి కూతుర్లవేపు చూస్తూంటే, గుండె పీక్కుపోతోంది! తను చచ్చిపోతాడు! యిల్లు కదలని తల్లులు, యింటింట అడుక్కుంటారు! లోకం వాళ్ళని కనికరించదు. వాళ్ళ యౌవనాన్ని దోచుకోవాలని యెందరు వెంటపడ్తారు! ఆకలితో మానం అమ్ముకున్న ఆడవాళ్ళ గురించి తను యెన్ని కథలు చదివాడు!

యెంతమంది చెప్పగా విన్నాడు. యౌవనంతో తొణికిసలాడుతున్న తన కూతుర్లు మాత్రం యేమవుతారు? అన్ని మంచి గుణాలూ ఆకలిపొట్టలో ఆహుతి అయిపోతాయి! అలా ఆలోచించేవా రెందరూ? పలానా నీలకంఠం కూతుర్లు వీధిన పడ్డారు. రంకులాటయ్యారని అంటారు! ఎంత అప్రతిష్ఠ! ఇప్పుడే ఇంత ఎగురుతోంది కదా, నేను కళ్ళు మూస్తే, నా చిన్నకూతురు యెవడితోనో యెగిరి పోదూ?

నీలకంఠం దుఃఖానికి అంతు పంతూ లేకపోయింది. ఆ దుఃఖంతోపాటు యేనిముషంలో కళ్ళు మూస్తానన్న భయంకూడా కొండంతయ్యింది. ఈ భయంతో పాటే కూతుర్ల నోటివెంబడి మాటలు విందామని కోరిక హెచ్చయింది!

అమ్మా! అని పిలిచాడు. పెద్దకూతురు ఆత్రుతతో దగ్గరగా వచ్చింది. రెండో కూతురు లేచి తండ్రి దగ్గరకు పోయింది. నా బంగారు తల్లులు - వాళ్ళ ముఖాలు కనిపిస్తూంటే అలాంటి పవిత్రమైన పిల్లలని విడిచి వెళ్తున్నానే అని బావురుమని పైకి యేడవలేక, లోన గగ్గోలు పెట్టి యేడుస్తున్నాడు.

చివరకు హీనమైన గొంతుకతో దుఃఖాన్ని మిళితం చేసి "సరమ్మా సరి!" అందామని అనలేక గొనుక్కొన్నాడు. యిద్దరి కూతుర్ల కన్నీళ్ళు తనమీద వ్రాలేయి. కొంతసేపటివరకూ ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళు మూసేశాడు. ఈ క్షణంవరకూ ఈ ప్రపంచంలో తను అసహ్యించుకోకుండా వున్న వీ రెండు జీవాలే!

తను అందా మనుకొన్న వెన్నిఉన్నా ఒకమాటా అనలేకపోతున్నాడు. "ఎటు చూస్తే అటు చీకటిలా" కనిపిస్తోంది. మళ్ళీ కళ్ళు తెరచి, ఆ ముఖాలవేపు చూసి వెయ్యి గొంతుకలు కలిగినట్లుగా తనకు చావురావద్దని యేడ్చుకొన్నాడు.

ఏ నిముషంలో మాట పడిపోతుందో? ఏ క్షణంలో గుండె ఆగిపోతుందో? తను కోరికను వెళ్ళగక్కాలి. కాని యేమని చెప్పగలడు? తనకు కావలసింది తన కూతుర్లు తను చచ్చిపోయాక వాళ్ళశీలాన్ని కాపాడుకుంటామని వాగ్దాన మివ్వాలి. కడుపుకు లేకపోతే చచ్చిపోతాం గాని, లోకం వేలెత్తి చూపించేట్లుగా వుండమని హామీ యివ్వాలి!

ఎంత సంక్షోభం చెందినా ఆ మాట తను బయటకు అనలేకపోయాడు. కూతుర్లు తెగించి అంటారని కాంక్షించాడు! కాని, వాళ్ళు తల్లి శరీరంలో బాగు లేనపుడు ఎలా యేడ్చారో అలానే యిప్పుడూ ఏడుస్తున్నారు. వాళ్ళ ఏడుపుకు కారకుడు తనేగా! వాళ్ళకు యీ రక్త మాంసాలతో తప్పించి యింకేమి వుంచాడు?

ఒక్క మూలుగు బాధతో మూలిగాడు! కూతుర్లిద్దరూ మరీ దగ్గరకు జరిగారు. యిద్దరిచేతులూ పట్టుకొని, కళ్ళల్లో నీరుబికి ప్రవహిస్తూంటే, యిద్దరూ వెక్కివెక్కి యేడుస్తున్నారు. "సరమ్మా....సరి........మీ అమ్మదగ్గరకు వెళ్ళి పోతాను....మీ గతి........!"

ఉధృతంగా వచ్చే దుఃఖం మాటలను రానియ్యలేదు. కూతుర్ల నోటి వెంబడి మాట విందామని మహా ఉబలాటపడుతున్నాడు.

నిముషాలు దాటిపోతున్నాయి. ఏడుపు తప్పించి ఒక్క మాటా రాలేదు. ప్రతిక్షణం యిదే ఆఖరుక్షణం అనుకుంటూనే ఆ ఒక్కమాటా విందామని నిరీక్షణగా చూస్తున్నాడు. కాలం దొర్లిపోతూంది. తన కాంక్ష కృంగిపోతూంది! నిరాశతో నిట్టూర్పులను విడుస్తున్నాడు. రానురాను "మాకేం నాన్నా?" అనైనా యీ కూతుర్లు అంటారేమోనని, ఆ మాట వినైనా చచ్చిపోదామని యెదురు చూశాడు.

మళ్ళీ అన్నాడు - "పాడు మనుషులు - యీ పాడు లోకంలో - మీరు బ్రతకటానికి - యేమీవుంచలేదమ్మా! ఎలా వుంటారో?"

ఈ మాటలకు మరింత యేడుపు తప్పించి మాటలు రాకపోవటంతో చిరాకు, దుఃఖం, కోపం, జాలి- అన్ని అనుభూతులూ ఒక్కసారి కల్గాయి.

తన భార్య చావు జ్ఞప్తికి వచ్చింది! ఎంత హాయిగా చచ్చిపోయింది! తనకు అదృష్టం లేకపోయింది. యీ జన్మ ఉత్త పనికిమాలినదైందని

తలపుకు వచ్చింది. తను చచ్చిపోతున్నాడు........ఏడుస్తూ చచ్చిపోతున్నాడు.... ....ఆ క్షణంలో తనకు తను విడిచిపెట్టున్న యీ లోకంలో అన్నీ అసహ్యించు కొన్నవే........తన యిద్దరు పెద్దమ్మాయిలుకూడాను!

కళ్లు నిలబెట్టి అలా చూస్తూంటే, కూతుర్లిద్దరికీ భయంవేసి కావు మన్నారు. చిన్న కూతురు లేచి గబగబ వచ్చింది. తండ్రి మంచంమీద కూర్చో గానే నీలకంఠం ముఖం ప్రక్కకు త్రిప్పివేశాడు.

సన్యాసమ్మ యేడుస్తున్న యిద్దరి అక్కలవేపు తీక్షణంగా చూసింది. నాన్న వంటిమీద చెయ్యివేసి "యింకేమీ రాదర్రా మీకు! యిలా యేడుస్తూ నాన్నని అధైర్యపరచకండి! ఊరుకుంటారా లేదా?" అంటూ ఒక్కగసురు విసిరే సరికి యిద్దరూ చెల్లెలివేపు చూశారు.

ఈ మాటలు తను వినకూడ దనుకున్నా విన్నాడు. ఏమీ అనుకోకూడ దనుకున్నా అనుకున్నాడు. తను నిజంగా చచ్చిపోతున్నాడా? లేక తన అధైర్యమే తను చచ్చిపోతున్నాడని అనుకోనిస్తుందా?

చిన్నకూతురు "నాన్నా, నాన్నా........" అని పిలిచింది. అనుకోకుండానే వూఁ అని మూలిగేడు. "అధైర్యపడకండి! డాక్టరు చెప్పాడు. నీరసం తప్పించి యింకేం కాదని! నాలుగు రోజులలో లేచి కూర్చుంటారుగా! కొద్దిగా నోరు తెరవండి........ బార్లీ నీరు పోస్తా!"

తనకు జబ్బూ లేదూ తను చచ్చిపోవడంలేదూ! అబ్బబ్బే తను చచ్చి పోతున్నాడే!"

కూతురు నోటిలో బార్లీ పోస్తుంటే, త్రాగకూడదనే గుటక వేశాడు. గుటక వేశాక తను గుటక వెయ్యగలిగానని, తను బ్రతుకుతానని కొద్దిగా ఆశ కలిగింది!

చిన్నకూతురు అంతతో చాలించలేదు. ఆమె గొంతు విప్పితే తన కేదో క్రొత్త అనుభూతి కలుగుతోంది! అసహ్యం, అధైర్యాలనే మంచుకొండల్లో తను కప్పబడ్డాడు! ఆమె మాటలు సూర్యరశ్మిలా వాటిని కరిగిస్తోంది!

అయినా, ఆమెవేపు కన్నెత్తి చూడలేదు. లోలోనే యెన్నెన్నో అను కుంటున్నాడు!

సన్యాసమ్మ కల్లోలంలో ఒక చల్లని కబురు చెప్పింది. తను కలలోనైనా యీ మాట తనకూతురి నోటివెంబడి వస్తుందని వూహించలేదు. కాలేజీ మానేస్తా నని కూతురు చెప్పగానే మనిషి ముఖం నిగనిగలాడింది. పోయిన ప్రాణాలు తన బొందికి చేరుకున్నట్లనిపించింది. కూతురు తియ్యగా అన్నది:"మీరధైర్యపడకండి

నాన్నా! ఈ అప్పులుతీరవని బెంగపడకండి. ఇప్పుడెలాగూ ప్రయివేట్లు చెప్తున్నాగా, చదువు చాలిస్తాను. మరికొందరికి చదువు చెప్పొచ్చు! ఉద్యోగం దొరికేవరకూ యిలా కానిస్తాను!"

ఈ ముక్కల్లో వెయ్యోవంతు కాంక్షించి, నిరాశ చెందిన నీలకంఠంకు లేచి కూర్చోవా లనిపించింది. చిన్న కూతురు అంతతో వూరుకోలేదు. "ఇద్దరి జీతం యేం చేసుకుంటాం నాన్నా? చిన్నక్క పెళ్ళి చేద్దాం! అంత ముందుకొచ్చే మగాడుంటే. పెద్దక్క పెళ్ళికూడా చేద్దాం! మనకేం? మనదబ్బే ఒకరు తినే పరిస్థితి వస్తుంది!"

నీలకంఠం కళ్ళల్లో నీరు వుబికింది. ఒక్కసారి శరీరమంతా వుబికినట్లయింది ఏడుస్తూనే నవ్వుతున్నాడు! తన కూతురు పుట్టి ముందు కొడుకని పడ్డ ఆరాటం మనసులో తిరిగింది. దేవుడు తనకు కొడుకుకంటే హెచ్చయిన రత్నాన్ని యిచ్చాడు. దేవుని దూషించినందుకు, యీ కూతుర్ని అసహ్యంగా చూచినందుకు విచారించాడు. తన భయంతో తను మెడలో వేసుకున్న వురిని యీ కూతురే తప్పించింది!

అయ్యో! తను జీవితంలో ఎంత తెలివిలేని పని చేశాడు? తన పెద్ద కూతుర్లిద్దరిని చదివించి వుండాలసిందే!!

(1950)

కొడుకు పెట్టిపోయిన మనిషి

నీలకంఠం - పార్వతీశం

సన్యాసమ్మ - వర్ధనే.

[illegible]